బీజేపీ, కాంగ్రెస్ పార్టీలవి కుమ్మక్కు రాజకీయాలు

- మోదీ ప్రచారం పార్లమెంటు ఎన్నికలకే
- అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇవ్వబోతున్నారు
- మీడియాతో ఇష్టాగోష్టిలో కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎంత కుమ్మక్కు రాజకీయాలు చేసినా ఈ ఎన్నికల్లో తాము గతంలో కంటే ఎక్కువ స్థానాల్లో గెలిచి ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రాబోతున్నట్టు మంత్రి కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. బుధవారం దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ భవన్‌లో రక్తదానం చేసిన ఆయన అనంతరం మీడియాతో ఇష్టాగోష్టిగా ముచ్చటించారు. తాము చేసిన అభివృద్ధి, సంక్షేమం వైపే ప్రజలు ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తమ కార్యాలయంలో కూర్చొని సర్వేలు చేసిన విషయం ప్రజలు తెలిసిపోయిందని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ పరస్పర ప్రయోజనాల కోసం సర్వశక్తులు ఒడ్డాయని ఆరోపించారు. గతంతో తమ అభ్యర్థులు ఓడిపోయిన ములుగు, గోషామహల్ సహా ఖమ్మంలోని కొన్ని స్థానాలను కూడా ఈసారి బీఆర్ఎస్ గెలుబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. కొడంగల్, కామారెడ్డిలో రేవంత్ రెడ్డి.. గజ్వేల్, హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్ ఓడిపోతారని జోస్యం చెప్పారు. గోషామహల్, కోరుట్ల, కరీంనగర్, ఆదిలాబాద్ సహా పలు నియోజకవర్గాల్లో బీజేపీని గెలిపించేందుకు కాంగ్రెస్ పార్టీ బలహీన అభ్యర్థులను నిలిపిందని ఆరోపించారు. నాంపల్లిలో ప్రచారం చేసిన రాహుల్‌గాంధీ గోషామహల్‌లో ప్రచారం చేయలేదని, కరీంనగర్, కోరుట్లలో రేవంత్ ప్రచారం చేయలేదని గుర్తు చేశారు. తెలంగాణలో ప్రధాని మోదీ ప్రచారం పార్లమెంటు ఎన్నికల దృష్టిలోనే సాగిందని విమర్శించారు.

ఆ జిల్లాల్లో క్లీన్‌స్వీప్

ఈసారి ఉమ్మడి మెదక్, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలను తాము స్వీప్ చేయబోతున్నట్టు కేటీఆర్ తెలిపారు. కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ స్థానాలను నిలబెట్టుకుంటామని, ఖమ్మంలో ఈసారి ఆరేడు సీట్లు సొంతం చేసుకోబోతున్నట్టు వివరించారు. గతంలో 108 స్థానాల్లో డిపాజిట్ కోల్పోయిన బీజేపీకి ఈసారి అంతకుమించిన భంగపాటు తప్పదని చెప్పారు. పొలిటికల్ టూరిస్టులు వచ్చిపోతుంటారని, ఈ గడ్డ బిడ్డ కేసీఆర్‌నే ప్రజలు తమ నాయకుడిగా ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి అడ్డుచెప్పని కాంగ్రెస్ పార్టీ రైతుబంధుకు మాత్రం అడ్డుచెప్పడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. టీహబ్‌లో నిరుద్యోగ యువతతో మాట్లాడినందుకు ఈసీ తనకు నోటీసులు ఇచ్చిందని, మంత్రి హరీశ్‌రావు రైతుబంధుపై మాట్లాడితే చర్యలు తీసుకోవాలి కానీ పథకాన్ని ఆపడం సరికాదని తెలిపారు. కర్ణాటకలో 'పవర్' ఇవ్వలేకపోతున్న కాంగ్రెస్ పార్టీ ఇక్కడ పవర్‌లోకి వచ్చినా అదే పరిస్థితి ఉంటుందని విమర్శించారు. ముఖ్యమంత్రి పదవిని గుంపుమేస్త్రీతో పోల్చిన నాయకులు అధికారంలోకి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాలని మంత్రి కేటీఆర్ సూచించారు.

కాంగ్రెస్ కుట్రల వ్యూహం

- ఫేక్ సర్వే రిపోర్టులు, ఆడియోలతో ఓటర్లను పక్కదోవపట్టించే యత్నం
- టీవీ9 సర్వే పేరిట బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం
- అప్రమత్తమైన బీఆర్ఎస్ పార్టీ
- ఈసీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధం

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): పోలింగ్ రోజు.. పొద్దున్నే ప్రజలు ఓటు వేయటానికి వెళ్తున్న సమయంలో.. బీఆర్ఎస్ ప్రభుత్వ క్రెడిబిలిటీని దెబ్బతీసేలా ఒక్కసారిగా ప్రచారం మొదలయ్యే ప్రమాదమున్నదని బీఆర్ఎస్ నేతలు అనుమానం వ్యక్తంచేశారు. బుధవారం ప్రముఖ న్యూస్ చానల్ టీవీ 9 సర్వే పేరుతో ఓ నకిలీ సర్వేను సోషల్‌మీడియాలో భారీగా సర్క్యులేట్ చేశారు. పోలింగ్ రోజు ఇలాంటి ప్రచారాలు మరింత తీవ్ర కావచ్చని తెలుస్తున్నది. డీప్ ఫేక్ టెక్నాలజీని వినియోగించి బీఆర్ఎస్ కీలక నేతలపై అవినీతి, అక్రమాల పేరుతో తప్పుడు ప్రచారం జరిగే ప్రమాదం ఉన్నదని ఆ పార్టీ నేతలు బుధవారం ఆందోళన వ్యక్తంచేశారు. పోలింగ్‌కు ముందు ఓటర్లను తికమకపెట్టేందుకు కొన్ని పార్టీలు కుట్రలకు తెరలేపినట్టు సమాచారం. టీవీ 9 సర్వే పేరుతో ప్రచారమైన ఫేక్ సర్వేలో ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోతుందంటూ తలాతోక లేని లెక్కలతో ఓటర్లను గందరగోళపర్చే ప్రయత్నాలు జరిగాయి. ఇలాంటివే మరికొన్ని సోషల్‌మీడియాలో పోటెత్తవచ్చని బీఆర్ఎస్ నేతలు అనుమానిస్తున్నారు. దుబ్బాక ఉప ఎన్నిక సమయంలో కూడా ఇలాంటి ప్రచారమే జరిగింది. పోలింగ్ రోజు కాంగ్రెస్ అభ్యర్థి బీఆర్ఎస్‌లోకి పోవటానికి సిద్ధమయ్యాడంటూ బీజేపీ సోషల్ మీడియాలో నకిలీ ప్రచారానికి తెరలేపింది. దీంతో చాలామంది ఓటర్లు తికమకపడి కాంగ్రెస్‌కు వేయాలనుకొన్న ఓట్లను బీజేపీకి వేశారు. ఇప్పుడు కూడా ఇలాంటి ప్రచారమే జరుగబోతున్నట్టు తెలిసింది. ఎన్ని గ్యారెంటీలిచ్చి, అరిచి పెడబొబ్బలు పెట్టినా ప్రజలు పట్టించుకోకపోవటంతో దింపుడు కల్లం ఆశగా కాంగ్రెస్ పార్టీ ఇలాంటి కుట్రలకు తెరలేపే ప్రమాదం ఉన్నదని బీఆర్ఎస్ నేతలు అనుమానిస్తున్నారు. పోలింగ్ రోజు ఇలాంటి నకిలీ ప్రచారం ఒక్కసారిగా గుప్పుమంటే నిజం బయటకు వచ్చేటప్పటికీ పోలింగ్ ముగిసి పోతుంది. ఆలోపు డబ్బాలో ఓట్లు పడిపోతాయి. ఆ తర్వాత నిజం తెలిసినా చేయగలిగేదీ ఏమీ ఉండదు.

నమ్మించేలా ఫేక్ కుట్రలు

టీవీ 9 సత్తాబజార్ పేరిట ప్రచారమైన సర్వేలో కాంగ్రెస్ పార్టీ జిల్లాలవారీగా ఇన్ని సీట్లు గెలవబోతున్నదని ఉన్నది. ఆ సర్వేను బాగా చదువుకొన్నవాళ్లు, రాజకీయాల్లో ఉన్నవారు కూడా నమ్మేలా రూపొందించారు. అలాంటిది సామాన్యులు అది నిజమని నమ్మటం పెద్ద కష్టమేమీ కాదు. ఈ కుట్రలకు కొనసాగింపుగా ముఖాలను మార్చి బీఆర్ఎస్ ముఖ్యులు డబ్బు సంచుల గురించి, అవినీతి అక్రమాల గురించి అంతర్గతంగా చర్చించుకొంటున్నట్టు నకిలీ వీడియోలను కొందరు విపక్ష వ్యూహకర్తలు బుధవారమే సిద్ధం చేసినట్టు బీఆర్ఎస్ వర్గాల సమాచారం. బీఆర్ఎస్‌పై వ్యతిరేకతను ప్రేరేపించేందుకు టెక్నాలజీని దారుణంగా వాడుకొనే కుట్రలు జరుగుతున్నాయని సమాచారం. కొడంగల్‌లో బీఆర్ఎస్ ఓడిపోతుందని మంత్రి కేటీఆర్ అన్నట్టుగా ఇప్పటికే ఓ ఫేక్ ఆడియోను విపక్షాలు రూపొందించాయని, గెలిచిన ఎమ్మెల్యేలతో క్యాంప్ ప్లాన్ చేస్తున్నట్టు కూడా మరో ఫేక్ ఆడియోను తయారు చేశాయని, వాటిని సోషల్‌మీడియాలో పోలింగ్ రోజు విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నాయని సమాచారం. ఇలాంటి కుట్రలపై బీఆర్ఎస్ కార్యకర్తలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, ప్రజలను చైతన్యపర్చాలని పార్టీ అధిష్ఠానం కోరింది. ఫేక్ ప్రచారంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైంది.

లోకం పోకడ



కేసీఆర్ విజయం కాంక్షిస్తూ శ్రీవారికి పూజలు

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ : తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపిన సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధించి చరిత్ర సృష్టించాలని ఆకాంక్షిస్తూ తిరుమల శ్రీవారికి ఏపీ బీఆర్ఎస్ నేత ఆర్కాట్ కృష్ణప్రసాద్ పూజలు చేశారు. బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ తోట చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్‌తో పాటు పార్టీ కార్యకర్తలు శ్రీవారికి 101 కొబ్బరికాయలు కొట్టారు. తెలంగాణలో స్థిరపడ్డ ఏపీ ప్రజలు, రాష్ట్ర ప్రజానీకం యావత్తు బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని కోరారు. కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే మాడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దారని కొనియాడారు. కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని విశ్వాసం వ్యక్తం చేశారు.

చరిత్రను మలుపుతిప్పిన దీక్ష

తల్లి తెలంగాణ సంకెళ్లను తెంచిన సత్యాగ్రహం

స్వరాష్ట్ర సమరంలో సముజ్వల సన్నివేశం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణ చరిత్రను మలుపుతిప్పిన మహోన్నత పోరాట ఘట్టం దీక్షా దివస్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పరిశ్రమ లశాఖల మంత్రి కే తారక రామారావు తెలిపారు. దీక్షా దివస్ అంటే తల్లి తెలంగాణ సంకెళ్లను తెంచిన సత్యాగ్రహమని బుధవారం ట్వీట్(ఎక్స్) చేశారు. స్వరాష్ట్ర సమరంలో సముజ్వల సన్నివేశమని కొనియాడారు.

చరిత్రను మలుపుతిప్పిన దీక్ష..!
తల్లి తెలంగాణ సంకెళ్లను తెంచిన సత్యాగ్రహం..
స్వరాష్ట్ర సమరంలో సముజ్వల సన్నివేశం..
స్వాతంత్ర్య పోరాటాన్నిమించిన
సమోన్నత సందర్భం..

యావత్ జాతి ఏకమై ఉద్యమ కడలి
ఉవ్వెత్తున ఎగసిన దృశ్యం..
చావునోట్లో తలబెట్టి గెలిచిన సాహసం..
ఢిల్లీ మెడలు వంచిన ధీరత్వం..
ఆధునిక ప్రపంచంలో
అద్భుతమైన పోరాటఘట్టం..
తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో..
ఆమరణ రణ నినాదం!

చెక్కుచెదరని ఉక్కు సంకల్పం
పట్టుసడలని దీక్షాదక్షతతో
ఆత్మగౌరవ విశ్వరూపం చూపిన సకల జనం..
అర్ధరాత్రి స్వాతంత్ర్య ప్రకటనతో నెరవేరిన శపథం..

ఉద్యమబాట వీడితే రాళ్లతో కొట్టండి..
తెలంగాణ కోసం బొంతు పురుగునైనా
ముద్దుపెట్టుకుంటం..
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఢిల్లీకి పోతున్నా
మళ్లా తెలంగాణ రాష్ట్రంలోనే అడుగుపెడతా..
సాహసోపేత నినాదాలతో.. అసాధ్యాన్ని
సుసాధ్యం చేసి స్వప్నాన్ని సత్యంగా మలచి
గమ్యాన్ని ముద్దాడిన గట్టి సిపాయి కేసీఆర్.

నవంబర్ 29.. దీక్షా దివస్
తెలంగాణ సోయిని.. అస్తిత్వాన్ని..
అస్మితను తట్టిలేపే రోజు..
ఆత్మగౌరవ ఆకురాయిపైన మన చైతన్యాన్ని
పదును పెట్టుకునే రోజు!

త్యాగాల స్ఫూర్తితో తెలంగాణకు
పునరంకితం కావాల్సిన రోజు!
జై తెలంగాణ

దీక్షా దివస్ స్ఫూర్తిని కొనసాగిద్దాం: హరీశ్‌రావు

దీక్షా దివస్ స్ఫూర్తిని కొనసాగిద్దామని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు తెలిపారు. నవంబర్ 29వ తేదీ తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో అతి ముఖ్యమైన రోజని బుధవారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'తెలంగాణ జైత్రయాత్ర.. కేసీఆర్ శవయాత్రో' అని నినదించిన కేసీఆర్.. ఆమరణ దీక్షకు పూనుకొని ఉద్యమాన్ని ఉర్రూతలూగించారు.'కేసీఆర్‌గారి పిలుపు.. తెలంగాణ ఊరూరా ప్రతిధ్వనించింది. వాడవాడనూ కదిలించింది. ప్రతి తెలంగాణ బిడ్డను పిడికిలి బిగించేలా చేసింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించేందుకు కారణమైంది. దీక్షా దివస్ స్ఫూర్తిని కొనసాగించాలి. జై తెలంగాణ' అని ట్వీట్ చేశారు.

దీక్ష వేళ కన్నీటి తడి.. ఇప్పుడదే అందరికీ స్ఫూర్తి: ఎమ్మెల్సీ కవిత

తెలంగాణ కోసం కేసీఆర్ ప్రాణాలకు తెగించి దీక్షకు దిగిన వేళ గుండెలు కన్నీటితో నిండాయని, కానీ ఇప్పుడదే అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. అప్పటి దీక్షా దివస్‌ను తలుచుకొంటే, ఇప్పటి తెలంగాణను చూస్తుంటే అందరి గుండెలు ఆనందంతో పొంగుతున్నాయని బుధవారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'ఆనాడు అన్నం బంద్ చేసి కోట్లాడి తెలంగాణను తెచ్చావ్.. ఇప్పుడు రాష్ట్రాన్ని అన్నపూర్ణగా మార్చావ్.. చిమ్మ చీకట్ల తెలంగాణను వెలుగు జిలుగుల రాష్ట్రంగా మార్చావ్..కన్నీరు కారుస్తున్న రైతన్న కోసం ఉపవాస దీక్షతో రాష్ట్రంతోపాటు గోదావరి నీళ్లు కూడా తెచ్చి వారి కాళ్లు కడిగావ్.. అవ్వా తాతలకు పెద్దకొడుకుగా.. ఆడపడుచులకు అన్నగా.. మేనమామగా.. తాతగా.. అందరికీ ఆప్తుడివయ్యావ్.. ఆ దీక్ష సమయంలో కన్నీటితో కరిగిన మా గుండెలు.. ఇప్పుడు ఆనందంతో ఉప్పొంగుతున్నాయ్' అని ట్వీట్ చేశారు.

లెజెండ్ కేసీఆర్: ఎంపీ సంతోష్

తెలంగాణ ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ఆమరణ దీక్షను ఎంపీ సంతోష్‌కుమార్ స్మరించుకున్నారు. 'దీక్షా దివస్ లోతైన భావోద్వేగాలను రేకెత్తిస్తుంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ, తెలంగాణ గుండె చప్పుడు ప్రతిధ్వనిస్తున్నట్టు నేను భావిస్తున్నాను. ప్రజలు తమ లెజెండ్ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ పాలనను కొనసాగించాలని ఇప్పటికే ధృడంగా నిర్ణయించుకున్నారు. ఇది ఉమ్మడి కలలకు నిదర్శనం' అని ట్వీట్ చేశారు.

తెలంగాణ కాంక్షకు సజీవ సాక్ష్యం దీక్ష

దీక్షా దివస్ అనుభూతులను నెమరువేసుకున్న మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): దీక్ష దివస్ సందర్భంగా 2009 నవంబర్ 29 నాడు జరిగిన వీరోచిత సన్నివేశాలను తన జీవితంలో మరచిపోలేనని మంత్రి కేటీఆర్ తెలిపారు. సిద్దిపేటలోని ఆమరణ హార దీక్షాస్థలికి బయలుదేరిన కేసీఆర్‌ను అల్లుగూర్‌లో అరెస్టు చేసి ఖమ్మం తరలించి, తమను అరెస్టు చేసి వరంగల్ సెంట్రల్ జైలు వేశారని తెలిపారు. ఖమ్మం హాస్పిటల్ తీస్కపోయిన రోజే కేసీఆర్ దీక్ష విరమించారని ఫేక్ న్యూస్ ప్రచారం చేయడం కేసీఆర్ కోపంతో తాను మీడియాతో మాట్లాడతానని పట్టుబట్టారని తెలిపారు. కిటికీ గాజు ముక్కను పట్టుకొని.. మరో చేతిని చూపిస్తూ.. 'మీరు మీడియాను పిలుస్తారా? లేదా?' అని గట్టిగా అరిచారు. కేసీఆర్ ఆపేందుకు పోలీసులు వార్డుల్లోకి వెళ్లాలని చూస్తే నాయిని నర్సింహారెడ్డి, కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఆ పోలీసు గుంపును ఆపారని, తెలంగాణ కాంక్షకు నాటి పోరాటం సజీవసాక్ష్యమని గుర్తుచేసుకున్నారు.

కేసీఆర్ హ్యాట్రిక్ పక్కా

ప్రజాఆశీర్వాద సభలు సక్సెస్ • పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ) : సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభలు జనసంద్రాన్ని తలపించాయని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ తెలిపారు. ఆశీర్వాద సభల విజయవంతంతో ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టడం రుజువైందని పేర్కొన్నారు. తొమ్మిదిన్నరేండ్ల పాలనలో దేశానికే దిక్సూచిగా తెలంగాణను తీర్చిదిద్దిన సీఎం కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా 96 ప్రజాఆశీర్వాద సభలను నిర్వహించి, సరికొత్త రికార్డు నెలకొల్పారని చెప్పారు. ఇప్పటి వరకు ఏ రాజకీయ నాయకుడు ఇన్ని సభలు నిర్వహించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో మరింత పరిణతి అవసరమని ఎన్నికలొస్తే ఆగమాగం కావద్దని కేసీఆర్ పదేపదే చెబుతూ ప్రజలను సరైన దిశగా ఓటు హక్కు వినియోగించుకొనే విధంగా వారిలో చైతన్యం కల్పించారని వెల్లడించారు. ప్రజల ఆశీర్వాదంతో వందస్థానాల్లో గులాబీ జెండా రెపరెపలాడటం తథ్యమని దామోదర్ ధీమా వ్యక్తం చేశారు.

నేడు చింతమడకకు కేసీఆర్ దంపతులు

సిద్దిపేట రూరల్, నవంబర్ 29: సిద్దిపేట జిల్లా చింతమడకలోని 13వ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వేసేందుకు సీఎం కేసీఆర్ గురువారం గ్రామానికి రానున్నారు. సీఎం ఆయన సతీమణి శోభ సైతం ఇక్కడే ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. బుధవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత గ్రామానికి చేరుకొని ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్, పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తుపై సీపీ తగిన ఆదేశాలు ఇచ్చారు.

ఉత్కంఠగా దీక్షా దివస్

- తెలంగాణభవన్‌లో ఉద్యమ సన్నివేశం
- వద్దన్న పోలీసులు.. సర్దిచెప్పిన నేతలు
- కేటీఆర్ రక్తదానం చేసి శిబిరం ప్రారంభం

దీక్షా దివస్ సందర్భంగా బుధవారం తెలంగాణభవన్‌లో రక్తదానం చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు వాసుదేవరెడ్డి తదితరులు

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): ఒక్కసారిగా 14 ఏండ్ల కిందటి సన్నివేశాలు పునరావృతమయ్యాయి. తెలంగాణభవన్‌లో బుధవారం ఉద్యమకాలం నాటి ఉత్కంఠ వాతావరణం నెలకొన్నది. పోలీసులు నాటి అత్యుత్సాహాన్నే ప్రదర్శించారు. బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన దీక్షా దివస్ కార్యక్రమంపై ఆంక్షలు విధించారు. ఎట్టిపరిస్థితుల్లో నిర్వహించకూడదని బీష్మించారు. 2009 నవంబర్ 29వ తేదీని తెలంగాణ సమాజం మరచిపోదని, తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో.., తెలంగాణ జైత్రయాత్ర.. కేసీఆర్ శవయాత్ర' అంటూ ఆమరణ నిరాహారదీక్ష చేపట్టడం ద్వారా తెలంగాణ రాష్ట్ర స్వప్నం సాకారమైందని, 2010 నంచి తాము క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని ఇప్పుడెందుకు తమను అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు పోలీసులతో వాదించారు. ఒక దశలో తెలంగాణభవన్ నుంచి ఎవరూ బయటకు రాకూడదని, బయట నుంచి ఎవరూ లోపలికి వెళ్లకూడదని పోలీసులు ఆంక్షలు విధించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దీక్షా దివస్ నిర్వహించొద్దని పోలీసులు తేల్చి చెప్పారు. ఆనవాయితీగా నిర్వహిస్తున్న దీక్షా దివస్‌ను అడ్డుకోవడం అన్యాయమని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పార్టీ జనరల్ సెక్రటరీ సోమా భరత్‌కుమార్ తదితరులు పోలీసులకు తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో తెలంగాణభవన్ ఉన్నదని, తాము నిబంధనల ప్రకారమే తమ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, తెలంగాణభవన్ ప్రాంగణంలో నిర్వహించుకొనే స్వేచ్ఛ తమకు ఉన్నదని తేల్చిచెప్పారు. వాదనలు.. చర్చోపచర్చలు నిర్వహించిన అనంతరం పోలీసులు తెలంగాణభవన్‌లో కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి అనుమతి ఇచ్చారు. తెలంగాణభవన్ ప్రాంగణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, భవన్‌లో ఉన్న ఆచార్య కొత్తపల్లి జయశంకర్ విగ్రహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర పురపాలక, ఐటీశాఖల మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నేతలు నాయినేని రాజేశ్వర్‌రావు తదితరులో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాగా, రాష్ట్ర సాధనను సాకారం చేసిన కేసీఆర్ దీక్షా దివస్‌ను ఎన్నారైలు ప్రపంచవ్యాప్తంగా నిర్వహించారు. అన్ని దేశాల్లోని ఎన్నారైలు సీఎం కేసీఆర్ పోరాటాన్ని స్మరించుకునట్టు బీఆర్ఎస్ ఎన్నారై కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల తెలిపారు.

మంత్రి కేటీఆర్ రక్తదానం

దీక్షా దివస్ సందర్భంగా మంత్రి కేటీఆర్ రక్తదానం చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక సంస్థల నాయకులు, పార్టీ నేతలు, వివిధ అనుబంధ సంఘాల నేతలు రక్తదానం చేశారు.

కేసీఆర్‌ను కాపాడిన వైద్యులకు రుణపడి ఉంటాం

- ఉద్యమంలో ప్రాణాలను కాపాడారు
- వారిమనోధైర్యాన్ని మరువలేం: కేటీఆర్
- నాడు సేవ చేసిన వైద్యులకు సన్మానం

దీక్ష సందర్భంగా కేసీఆర్‌కు వైద్య సేవలు అందించిన వైద్యులను బుధవారం సన్మానించిన కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): దీక్షా దివస్ సందర్భంగా 2009లో నాటి ఉద్యమనేతగా కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేసినప్పుడు వైద్యసేవలు అందించిన నిమ్స్ వైద్య బృందానికి ఎప్పటికీ రుణపడి ఉంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ కొనియాడారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన దీక్షా దివస్ కార్యక్రమంలో కేసీఆర్‌కు నాడు సేవలందించిన వైద్య బృందానికి మంత్రి జ్ఞాపికలు బహూకరించి, సత్కరించారు. కేసీఆర్‌కు వైద్యసేవలు అందించిన డాక్టర్లు శేషగిరిరావు, ప్రసాదరావు, శ్రీనివాస్ మంతా, దక్షిణామూర్తి, అజిత్‌కు తెలంగాణ ప్రజల పక్షాన కేటీఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆ వైద్య బృందం అందించిన సేవలకు ఎప్పటికీ రుణపడి ఉంటామని చెప్తూ కేటీఆర్ ఉద్వేగానికి లోనయ్యారు. నాడు కేసీఆర్ దీక్ష ఫలితంగానే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు బీజం పడిందని వైద్యుల బృందం దీక్షాదివస్ నాటి సంఘటనల సమాహారాన్ని, భావోద్వేగాలను ఈ సందర్భంగా నెమరువేసుకున్నారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	18.5°c	32.9°c
రంగారెడ్డి	18.6°c	33.0°c
నిజామాబాద్	19.0°c	29.7 °c
మెదక్	19.4°c	33.4°c
కరీంనగర్	21.0°c	31.0°c
వరంగల్	21.0°c	31.0°c
ఖమ్మం	21.0°c	32.0°c
నల్లగొండ	21.0°c	34.2°c
హైదరాబాద్	21.7°c	29.8°c
మహబూబ్‌నగర్	21.9°c	31.4°c

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

ఆఫీసర్ పోస్టులు

దేశవ్యాప్తంగా ఉన్న వివిధ శాఖల్లో కింది ఖాళీల భర్తీకి సెంట్ బ్యాంక్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ ప్రకటన విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 60
- **పోస్టులు:** ఆఫీసర్, సీనియర్ ఆఫీసర్ (హెచ్ఆర్/కంప్లయిన్స్)
- అర్హతలు, ఎంపిక తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 11
- **వెబ్‌సైట్:** https://www.cbhfl.com

ఎన్ఐవీలో..

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 80
- **పోస్టులు:** టెక్నికల్ అసిస్టెంట్, టెక్నీషియన్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 10
- **వెబ్‌సైట్:** https://niv.icmr.org.in

బామర్ లారీలో..

ప్రభుత్వ సంస్థ బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 46
- **పోస్టులు:** రీజినల్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్, ఆఫీసర్, జూనియర్ ఆఫీసర్ తదితరాలు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 6
- **వెబ్‌సైట్:** https://balmerlawrie.com

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- మెథడాలజీ, జనరల్ స్టడీస్ (గ్రూప్స్, డీఎస్సీ) పీఐఈ & ఐసీటీ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.